## క్లుప్తంగా

### వర్షం వస్తే ఇబ్బందులు



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో వాల్మీకి విగ్రహం వద్ద కొంత కాలంగా చిన్నపాటి వర్షానికి రోడ్డుపై నీరు నిలిచి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై వర్షపు నీరు రోజుల తరబడి నిల్వ ఉన్నా అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వార్డులు సందర్శించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

### శ్మశానవాటికకు స్థలం కేటాయించండి



ఆత్మకూర్: పట్టణంలోని ముస్లింలకు ఖబరస్తాన్ (శ్మశానవాటిక) నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలని కోరుతూ ముస్లింలు డీటీ చాణక్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. పట్టణ శివారులోని సర్వేనంబర్ 474లో నాలుగు ఎకరాలకు పైగా ప్రభుత్వ స్థలం ఉందని, ఈ భూమిని ముస్లింలకు కేటాయించి సహకరించాలని కోరారు. పెరుగుతున్న జనాభా రీత్యా పాత శ్మశానవాటికలో స్థలం సమాధులతో నిండిపోయిందని, దీంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు నివేదిస్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈద్గా కమిటీ నాయకులు ముజాహిద్, జంషీద్‌సాబ్, మోసీన్, ఖమర్, సిరాజ్‌అహ్మద్, ఖమురుద్దీన్, గనిసాబ్, ఖలీల్, జావెద్, ముక్తదీర్ తదితరులు ఉన్నారు.

### విధుల్లో చేరిన రెండో ఏఎన్‌ఎంలు

పాన్‌గల్: 20 రోజుల పాటు సమ్మెలో ఉన్న రెండో ఏఎన్‌ఎంలు సమ్మెను తాత్కాలికంగా విరమించి సోమవారం విధుల్లో చేరారు. రెండో ఏఎన్‌ఎంల డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం కమిటీ నియమించిందని, కమిటీ సూచన మేరకు సమ్మెను తాత్కాలికంగా విరమించి విధుల్లో చేరినట్లు వారు పేర్కొన్నారు. 20 రోజుల పాటు వారు సమ్మెలో ఉండటంతో వైద్య సేవలపై తీవ్ర ప్రభావం చూపిన విషయం తెలిసిందే. మండలంలోని ఏడుగురు రెండో ఏఎన్‌ఎంలు విధుల్లో చేరినట్లు సిబ్బంది తెలిపారు.

### ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి



మదనాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నూతన ఓటర్ సవరణపై బీఎల్‌ఓలతో తహసీల్దార్ అబ్రహంలింకన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. ఈనెల 19వ తేదీ వరకు నూతన ఓటర్ల నమోదు కార్యక్రమం ఉంటుందని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు నమోదులో బీఎల్‌ఓలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌కుమార్, ఆర్‌ఐ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రూ.3 లక్షల విరాళం

వనపర్తి: జిల్లాకేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పంపించిన రూ.3 లక్షల విరాళాన్ని అసెంబ్లీ బీఆర్‌ఎస్ సమన్వయకర్త వంగూరు ప్రమోద్‌కుమార్‌రెడ్డి గౌడ సంఘం నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు ప్రమోద్‌కుమార్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నరసింహగౌడ్, సుధాకర్‌గౌడ్, భగవంతుగౌడ్, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థికసాయం అందజేత

పెబ్బేరు రూరల్: కొల్లాపూర్‌కు చెందిన పెయింటర్ అంజి మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకోవడంతో బాధిత కుటుంబ సభ్యులకు పెయింటర్లు, పెయింగ్ షాపు ఓనర్లు ప్రశాంత్, సురేష్, రూ. 19 వేలు అందించారు. కార్యక్రమంలో సభ్యులు శాంతన్న, విజయ్, శేఖర్, మహిమూద్, నారాయణ, రాజు, రాము, చంటి, రాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో మౌలాలీ గంధోత్సవం



మౌలాలీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న భక్తులు



దుప్పల్లికి గంధం తీసుకొస్తున్న గ్రామస్తులు

మదనాపురం: మండలంలోని దుప్పల్లిలో సోమవారం సాయంత్రం మౌలాలీ, మహబూబ్ సుభాని, గంధోత్సవాలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఏటా వర్షాకాలంలో సరైన వర్షాలు కురవకుంటే గంధోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ముందుగా మహబూబ్ సుభాని దర్గాలో పాథేలు నిర్వహించి గుర్రంతో పాటు భాజభజంత్రీలు మోగిస్తూ కాలినడకన గ్రామస్తులు కొన్నూరు సమీపంలో ఉన్న మౌలాలీ గుట్టపైకి వెళ్లి అక్కడ కొలువుదీరిన మౌలాలీ దర్గాలో ప్రత్యేక ఫాతే కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దర్గాలో సమర్పించిన గంధాన్ని తలపై మోస్తూ తీసుకొచ్చారు. గ్రామంలో ఊరేగింపు నిర్వహించి దర్గా షరీఫ్‌కు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

## కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొత్తకోట: నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఓ పంక్షన్ హాల్లో ఈనెల 3న నిర్వహించిన 16వ జాతీయ స్థాయి కరాటే అండ్ కుంగ్ ఫూ చాంపియన్‌షిప్ 2023 పోటీల్లో కొత్తకోటకు చెందిన గాడ్స్ ఆన్ వారియర్స్ షోటోఖాన్ కరాటే అకాడమీకి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించడంతో పాటు గ్రాండ్ చాంపియన్‌షిప్ సాధించినట్లు క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన 1,500మంది విద్యార్థులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో కె.దుర్గాప్రసాద్, ఆర్.తరుణ్, ఎం విజయ్‌కుమార్, రిషిక్‌యాదవ్, ఇమ్రాన్, సోహెల్, ముషారఫ్, అబ్దుల్ రహెమాన్, వల్లభ, ఆదిత్య, అభిజిత్, అనిరుధ్, ఎండీ హర్షద్, ఎండీ రైజ్వాజ్, రాఘవేంద్ర, హర్షద్, సాయి, ధనుష్, రుమాస్, వైశ్విక్, నందస్, వేణు, జయంత్, లోకేష్ బాలికల విభాగంలో ఏకాంబరి, లాస్య, అక్షిత ఉన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులకు మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యుడు మన్నె శ్రీనివాస్‌రెడ్డి సర్టిఫికెట్లు, పథకాలు అందజేశారు. తమ అకాడమీకి చెందిన విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించడంతో సీనియర్ కరాటే మాస్టర్స్ మంజునాథ్, జాఫర్‌సాధిక్, ఇంతియాజ్ ఆనందం వ్యక్తం చేశారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో సీనియర్ కరాటే మాస్టర్లు

## నీట మునిగిన వరి పంట

ఆత్మకూర్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వీరరాఘవపూర్‌లో వందల ఎకరాల్లో వరి పంటలు నీట మునిగాయి. సోమవారం తెల్లావారు జామున మొదలుకుని రాత్రిదాక కురిసిన వర్షం కారణంగా సుమారు 120 ఎకరాల్లో పంటలు నీట మునిగినట్లు సర్పంచ్ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. తమను ప్రభుత్వ ఆదుకోవాలని లేని పక్షంలో తీవ్రంగా నష్టపోతామని రైతులు నాగేష్, కావలి కుర్మన్న, కృష్ణయ్య, కొండన్న, భరత్, అశోక్, సర్వారెడ్డి ప్రభుత్వానికి వేడుకున్నారు.



వీరరాఘవపూర్ శివారులో వరి పంటలో ఇసుక మేటలు

## వడ్డెరుల హక్కుల సాధనకు ఉద్యమిద్దాం



పర్వతాపురంలో నూతన కమిటీని సన్మానిస్తున్న రాష్ట్ర, జిల్లా నాయకులు

ఖిల్లాఘనపురం: వడ్డెరుల హక్కుల సాధనకు గ్రామ స్థాయి నుంచి ఐక్యంగా ఉద్యమించాలని జాతీయ వడ్డెర సంఘం కార్యదర్శి జరుపటి ఈశ్వర్, జిల్లా అధ్యక్షుడు దాసర్ల భూమయ్య అన్నారు. సోమవారం మండలంలోని పర్వతాపురం, షాపురంలో గ్రామ స్థాయి వడ్డెర సంఘం కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ బీసీ బంధులో వడ్డెరులకు ప్రాధాన్యత కల్పించాలని, వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. తమ హక్కుల సాధనకు ఏళ్లుగా పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని వాపోయారు. అనంతరం ఆయా గ్రామాల కమిటీలను ఏర్పాటు చేశారు. పర్వతాపురం గ్రామ అధ్యక్షుడిగా దండుగల నర్సింహ, ప్రధానకార్యదర్శి ఇరుగదిండ్ల వెంకట్రాములు, సత్యనారాయణ, కొండయ్య, శివ ను ఎన్నుకున్నారు. షాపురం కమిటీలో అధ్యక్షుడిగా వల్లెపు మణ్యం, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, అంజనేయులు, శ్రీను, శేఖర్, మన్యం, వెంకటేష్, ఈశ్వర్, సత్యయ్య ను కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్, ప్రచార కార్యదర్శి ఈశ్వర్, నాయకులు యాదగిరి, బలరాం, లోకయ్య, అంజనేయులు, మల్లేష్, రాములు, తిరుపతి, యాదగిరి, రవి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## 'ఇండియా' కూటమికి బుద్ధి చెబుదాం

బిజినేపల్లి: సనాతన ధర్మం నిర్మూలించాలని విషం చిమ్మే పార్టీలకు, ఇండియా కూటమికి బుద్ధి చెబుదామని బీజేపీ నాగర్‌కర్నూల్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ దిలీపాచారి అన్నారు.సోమవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందూత్వం మీద విమర్శలు చేసినట్లుగా మైనార్టీల మీద విమర్శలు చేసే దమ్ము ఇండియా కూటమికి కాని, బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. తమిళనాడు ముఖ్యమంత్రి కుమారుడు ఉదయనిధి స్టాలిన్ చేసిన ఆరోపణలను ఖండించారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తన పాదయాత్రలో ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో అడ్డా కూలీలను రోజుకు రూ.800 ఇచ్చి పాదయాత్ర చేసుకుంటున్నాడని ఆరోపించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి కనీసం డిపాజిట్ కూడా దక్కదని ఎద్దేవా చేశారు. బీజేపీ అభ్యర్థిని ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో బీజేపీ నాయకులు జాకీర్ హుస్సేన్, చంద్రకళ, భూషయ్య, తిరుపతిరెడ్డి, నారాయణాచారి తదితరులు పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో మాట్లాడుతున్న సుధాకర్‌రావు

**బీజేపీలో పలువురి చేరిక**

కొల్లాపూర్: మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన పలువురు సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి సుధాకర్‌రావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సాయికృష్ణగౌడ్, నాయకులు జగపతిరావు, గంగం మల్లేష్‌యాదవ్ ఉన్నారు.

## అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌లో చేరికలు



మాట్లాడుతున్న ప్రమోద్‌కుమార్‌రెడ్డి

కొత్తకోట రూరల్: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వివిధ పార్టీలకు చెందిన వారు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని వనపర్తి నియోజవర్గ సమన్వయకర్త వంగూర్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమోద్‌రెడ్డి మాట్లాడుతూ గడిచిన తొమ్మిదేళ్లలో బీఆర్‌ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ఎన్నికల సమయంలో వచ్చి మాయమాటలు చెప్పి ఓట్లు దండుకోవాలని చూసే వారిని నమ్మొద్దని ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన 60మందికి పైగా బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరుతున్న వారికి బీఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కొత్త, పాత తేడా లేకుండా అందరూ కలుసుకుని మంత్రి నిరంజన్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, మండల రైతుబంధు మండల అధ్యక్షులు రాజాప్రకాష్‌రెడ్డి, కుమార్‌యాదవ్, మన్నెపురెడ్డి, వేణుయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, కార్తిక్, శ్రీనివాస్‌రెడ్డి, కోట్ల వెంకటేష్, హన్మంత్, సర్పంచ్ సిద్ధయ్య, నాగేంద్రం, గోవర్ధన్‌రెడ్డి, భీంరెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, చిన్నారెడ్డి తదితరులు ఉన్నారు.

### ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

పాన్‌గల్: ఎస్సీ వర్గీకరణ బిల్లును ఈనెల 18 వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టకుంటే ఉద్యమిస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ గంధం లక్ష్మయ్య సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని మాట ఇచ్చి ఇప్పటికి తొమ్మిదేళ్లు గడుస్తున్నా వర్గీకరణ చేపట్టకపోవడం దారుణం అన్నారు. వర్గీకరణ బిల్లును ఈ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టే విధంగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు వినతిపత్రాలు అందజేయాలని ఆయన సంఘం నాయకులకు సూచించారు. ఈ విషయంపై స్పందించకుంటే ఉద్యమిస్తామన్నారు.

### అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



ఆత్మకూర్: అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ ఎస్ రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ అన్నారు. సోమవారం సీడీపీఓ భారతిరెడ్డికి అంగన్‌వాడీల సమ్మె నోటీసును అందజేశారు. కేసీఆర్ ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. రిటైర్మెంట్ బెనిఫిట్ కింద టీచర్లకు రూ.10లక్షలు, ఆయాలకు రూ.5లక్షలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాగేంద్రమ్మ, వెంకటేశ్వరమ్మ, విజయలక్ష్మి, రాణి, నిర్మల, స్వర్ణలత, మంజుల, రేణుకలత, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ టీచర్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ జమీల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 11వ తేదీన సమ్మె చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రమాదేవి, సువర్ణ, నాగమణి, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

### వీపనగండ్ల విద్యార్థినికి ఎంబీబీఎస్‌లో సీటు



వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన మాచర్ల అనూష అనే విద్యార్థికి ఎంబీబీఎస్ సీటు రావడంపై గ్రామంలోని పలువురు విద్యార్థినిని అభినందించారు. మాచర్ల పారిజాత, వెంకటేశ్వర్లగౌడ్ దంపతుల కుమార్తె అనూషకు నిర్మల్ జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఎంబీబీఎస్‌లో సీటు సాధించడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

### పంచాయతీ కార్మికుల సంక్షేమానికి కృషి

పాన్‌గల్: తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం)మండల నూతన కమిటీని సంఘం జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు ఆధ్వర్యంలో సోమవారం నియమించారు. మండల అధ్యక్షుడిగా యాదగిరి, మండల ప్రధాన కార్యదర్శిగా సుగ్రీవుడు, మండల కోశాధికారిగా కిషన్‌నాయక్, సలహాదారుడిగా బాల్యనాయక్, గౌరవ అధ్యక్షుడిగా సూర్యవంశం రాము, మండల ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, బాలస్వామి, వెంకయ్య, తిరుపతయ్య, సహాయ కార్యదర్శులుగా కుర్మయ్య, బాలకృష్ణ, కురమయ్య, అర్జునయ్య, నాగన్న కమిటీ సభ్యులుగా తొమ్మిది మందిని నియమించినట్లు సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు.

### దాడి ఘటనలో కేసు నమోదు

పెబ్బేరు రూరల్: దాడి ఘటనలో నలుగురు వ్యక్తులపై సోమవారం కేసు నమోదు చేసినట్లు వనపర్తి రూరల్ ఎస్‌ఐ నాగన్న తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు వనపర్తి మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన చిన్న నాగమ్మ పొలంలో పని చేసుకుంటుండగా.. అదే గ్రామానికి చెందిన పక్క పొలానికి చెందిన శ్రీకాంత్, కృష్ణ, విష్ణు, రాజు నాగమ్మ పొలంలోకి వెళ్లి గెట్లను తీసేస్తుండడంతో ప్రశ్నించిన తన భర్త శ్రీనివాసులును దూర్భాషలాడడంతో పాటు కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులు శ్రీకాంత్, కృష్ణ, విష్ణు, రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నాగన్న తెలిపారు.

### విద్యుత్ మోటారు చోరీ

కోడేరు: మండల కేంద్రానికి చెందిన రైతు అడిమయ్యకు సంబంధించిన విద్యుత్ మోటారు చోరీకి గురైంది. పోలీసుల వివరాల ప్రకారం జొన్నలబొగుడ రిజర్వాయర్ వద్ద పస్పుల, పాన్‌గల్ కాలువలో తన వ్యవసాయ పొలానికి నీరు పట్టేందుకు మోటారు ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మోటారును ఎత్తుకెళ్లారు. మోటారు విలువ రూ.30 వేల వరకు ఉంటుందని బాధితుడు పేర్కొన్నాడు. ఈ విషయంపై పోలీసుస్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు.

## టికెట్ బీసీకి కేటాయించాలని వినతి

పాన్‌గల్: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్, సిద్దికి ని మండల వాసి ఏఐసీసీ జాతీయ ఓబీసీ కోఆర్డినేటర్ డాక్టర్ కేతూరి వెంకటేష్ సోమవారం గాంధీభవన్‌లో కలిసి కొల్లాపూర్ అసెంబ్లీ టికెట్ బీసీలకు కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎస్‌యూఐ ఉస్మానియా యూనివర్సిటీ ప్రెసిడెంట్‌గా, కొల్లాపూర్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, ఆర్‌జీపీఆర్‌ఎస్ కోఆర్డినేటర్‌గా, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శిగా, ఏఐసీసీ జాతీయ ఓబీసీ కోఆర్డినేటర్‌గా, రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు 4,080 కిలోమీటర్లు నడిచిన తనకు టికెట్ కేటాయించాలని ఆయన కోరారు.



మురళీధరన్‌కు వినతిపత్రం అందజేస్తున్న డా.కేతూరి వెంకటేష్

## మండలస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం



పెద్దమందడి జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎస్‌జీఎఫ్ పోటీలు ప్రారంభిస్తున్న అధికారులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల స్థాయి బాలుర, బాలికల పాఠశాల క్రీడలు, ఎంపికను సోమవారం పెద్దమందడి జెడ్పీహెచ్ స్కూల్ ఆవరణలో ప్రారంభించినట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జి సురేందర్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీలను వాలీబాల్, కబడ్డీ, ఖోఖో విభాగాల్లో నిర్వహించగా మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంపిక చేసి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్దమందడి జెడ్పీహెచ్ ఫిజికల్ డైరెక్టర్ బి.కుమార్, జగత్‌పల్లి పీఈటీ శ్రీనివాసులు, మద్దిగట్ల, మోజర్ల పీఈటీ జయసింహారెడ్డి, బలిజపల్లి పీఈటీ రవి పాల్గొన్నారు.

## కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

పెబ్బేరు రూరల్: నేషనల్ హెల్త్ మిషన్ కింద జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరామ్, మోషె డిమాండ్ చేశారు. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని పంచాయతీ రాజ్ కార్యాలయం ఆవరణలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా చేస్తున్న వారు చేస్తున్న సమ్మెకు ఏఐటీయూసీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయిదు రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. జీఓ నెంబరు 510 ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీఈఓలను ఎల్డీ కంప్యూటర్‌గా మార్చాలని, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు ఇవ్వడంతో పాటు న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు బత్తుల రాఘవేందర్, వెంకటేష్, రాజేష్, ప్రవీణ, విజయకుమార్, సమీర్, భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్, మదన్‌కుమార్, స్పందన తదితరులు పాల్గొన్నారు.



సమ్మె చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

## జూరాలలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు



ధ్వజస్తంభం ప్రతిష్టిస్తున్న భక్తులు

ఆత్మకూర్: మండలంలోని జూరాలలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో గరుడసహిత ధ్వజస్తంభ ప్రతిష్ఠ, గ్రామదేవత కర్రెమ్మతల్లి (పెద్దమ్మతల్లి) నాభి శిల బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి పాతకాల పూజలు, యంత్ర ప్రతిష్ఠ, మూర్తి ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, పూర్ణాహుతి, ఆరాధన, మహాకుంభధేనుదర్శనం, హారతి ప్రత్యేక పూజలను వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శివరంజని, సర్పంచ్ మహిమూద, ఎంపీటీసీ సభ్యుడు పరమేష్, నిర్వాహకులు వీరేశలింగం, తిరుపతయ్యగౌడ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దవాగులో కొనసాగుతున్న వరద

అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండలాల్లో విస్తరించి ఉన్న పెద్దవాగులో వరద కొనసాగుతోంది. ఆదివారం తగ్గిన వర్షం సోమవారం ఉదయం మళ్లీ మొదలు కావడంతో పెద్దవాగుకు మరింత వరద పోటెత్తుతోంది. రెండు మండలాల్లో వాగులో నిర్మించిన చెక్‌డ్యాంలు నిండుగా ప్రవహిస్తున్నాయి. కందూర్ స్టేజీ వద్ద పెద్దవాగు నుంచి కాల్వ ద్వారా వరద నీళ్లను గుడిబండ చెరువుకు తరలిస్తున్నారు. మరో వైపు కొమిరెడ్డిపల్లి వద్ద కాల్వ ద్వారా మూడు గ్రామాల చెరువులకు నీళ్లు వెళ్తున్నాయి. శాఖాపూర్ శివారులోని పెద్దవాగులో కొత్తగా నిర్మాణం చేపట్టిన చెక్‌డ్యాం వద్ద పనులు నిలిచిపోయాయి. వరద నీళ్ల ధాటికి చెక్‌డ్యాం నిర్మాణం కొంత కొట్టుకుపోయినట్లు తెలిసింది. కందూర్ వైపు నుంచి లోకసముద్రం ద్వారా శాఖాపూర్ చెరువుకు వరద వస్తోంది. ఇదిలా ఉండగా కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా అడ్డాకుల పెద్ద చెరువు వరకు ఏర్పాటు చేసిన కాల్వ ద్వారా ఖిల్లాఘనపురం మండలాల్లోని చెరువులకు నీళ్లు వెళ్తున్నాయి. అడ్డాకుల చెరువుకు రావడానికి సమయం పట్టొచ్చని తెలుస్తోంది.



పెద్దవాగులో పారుతున్న వరద

### జాతీయ లోక్‌అదాలత్‌పై సన్నాహక సమావేశం

కొల్లాపూర్: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈనెల 9 న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్ సంబంధించిన కేసులపై న్యాయమూర్తులు ఆర్‌వీఎస్‌ఎస్ మిధున్‌తేజ, జోత్స్న గుంటిలు పోలీసులు, న్యాయవాదులతో చర్చించారు. చిన్నపాటి తగాదాల కారణంగా కోర్టుల చుట్టూ తిరిగే వారు లోక్‌అదాలత్ ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకునేలా చూడాలని సూచించారు. సమావేశంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు వసంతరెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు ఆర్.కురుమూర్తి, మోహన్‌లాల్, సీఐ యాలాద్రితో పాటు న్యాయవాదులు, ఎస్‌ఐలు ఉన్నారు.